బీఆర్ఎస్ పథకాలతో
నేటికీ ఫలితాలు

మొదటిపేజీ తరువాయి...

సామర్థ్యంతో హైదరాబాద్ ఇప్పుడు అధికారికంగా 100 శాతం మురుగునీటిని శుద్ధిచేస్తున్న మొదటి భారతీయ నగరంగా మారింది. గతంలో రూ. 3,866 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ఇది. మూసీనది పునరుజ్జీవనం, సుందరీకరణ మొదటిదశలో భాగంగా ఈ పనులు చేపట్టాం. దీనికోసం అప్పట్లో గ్లోబల్ డిజైన్ టెండర్లను కూడా పిలిచారు. హైదరాబాద్‌ను దేశంలోనే మొదటి నూరుశాతం మురుగునీటి శుద్ధి నగరంగా తీర్చిదిద్దుతామని మాటిచ్చాం. ఈ ప్రణాళికలో భాగంగా కోకాపేటలో 15ఎంఎల్‌డీల సామర్థ్యం గల మొదటి ఎస్‌టీపీని గతేడాది జూలైలోనే ప్రారంభించాం' అని కేటీఆర్ తెలిపారు.

తలసరి ఆదాయంలో అగ్రభాగాన నిలిపాం

తెలంగాణ రాష్ట్రాన్ని తలసరి జీడీపీలో దేశంలో అగ్రభాగాన నిలిపినట్టు కేటీఆర్ ఎక్స్ వేదికగా తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం గల రాష్ట్రంగా తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్బీఐ ప్రకటించిన 2024 తలసరి జీడీపీ నివేదికను షేర్ చేశారు. తెలంగాణ తరువాతి స్థానాల్లో కర్ణాటక, హర్యానా, తమిళనాడు, గుజరాత్, పుదుచ్చేరి రాష్ట్రాలు నిలిచాయి. దేశ తలసరి జీడీపీ 2,677 డాలర్లు కాగా, తెలంగాణ తలసరి జీడీపీ 4,745డాలర్లుగా ఉన్నది.

సర్కారు చదువు సర్వనాశనం

- అనేక సమస్యల్లో విద్యాసంస్థలు
- పాఠ్యపుస్తకాలు సహా అన్నీ కొరతే
- రాజకీయాలకే సీఎం ప్రాధాన్యం
- విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా పట్టింపులేదు
- 'మన ఊరు-మన బడి'ని కొనసాగించాలి
- 'సీఎం బ్రేక్ ఫాస్ట్'ను మళ్లీ అమలుచేయాలి
- రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ):రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ సర్వనాశనమవుతున్నదని, విద్యాశాఖ తనవద్దే ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. ఇందులో అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు కేసీఆర్ అనేక చర్యలు తీసుకున్నారని, పాఠశాల విద్య మొదలు ఉన్నతవిద్య వరకు సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. టీచర్లు, పాఠ్యపుస్తకాలు, దుస్తులు, తాగునీరు కొరత, వేతనాల చెల్లింపు ఆలస్యం తదితర సమస్యలన్నీ విద్యావవస్థను పట్టిపీడిస్తున్నాయని వెల్లడించారు. 'విద్యాశాఖను కూడా నిర్వర్తిస్తున్న మీరు రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యమిస్తున్నారు తప్ప, ప్రజా సమస్యల పరిష్కారంపై ఏమాత్రం దృష్టి సారించడం లేదు' అని లేఖలో సీఎం రేవంత్ రెడ్డికి చురకలంటించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా కొత్తగా చేసిందేమీ లేదని, గత ప్రభుత్వం చేసినవి కొనసాగించడంలోనూ విఫలమయ్యారని పేర్కొన్నారు. టీచర్లు, విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలలకు కాంగ్రెస్ పాలన శాపంగా మారిందని దుయ్యబట్టారు. 'ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు– మన బడి' అనే మహోన్నత కార్యక్రమాన్ని ప్రారంభిస్తే, మీరు దాన్ని కొనసాగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యం కాకుండా ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారు. కోడిగుడ్ల బిల్లులను సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడింది. రెండు జతల స్కూల్ యూనిఫాం ఇవ్వకుండా ఒక్క జత మాత్రమే ఇచ్చి మీ ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నది. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించవద్దనే మనవతా దృక్పథంతో గత ప్రభుత్వం 27 వేల పాఠశాలల్లో 'సీఎం బ్రేక్ ఫాస్ట్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తే దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. మరోవైపు సకాలంలో వేతనాలందక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేక పాఠశాలల్లో దోమలు, ఈగలు ముసురుతున్నాయి. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయక సిలబస్ ప్రకారం, పాఠ్యాంశాలు పూర్తి కావడం ప్రశ్నార్థకంగా మారింది. కరెంట్ బిల్లులు చెల్లించక అంధకారం అలుముకుంటున్నది' అంటూ సమస్యలు ప్రస్తావించారు. పాఠశాల విద్యావ్యవస్థను ఇన్ని సమస్యలు చుట్టుముట్టినా ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. భావిభారత పౌరులను తయారుచేసే పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేయడం విద్యాభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి బట్టబయలు చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే పాఠశాల విద్యను గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

లేఖలో డిమాండ్స్..

- రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం విధులు నిర్వర్తిస్తున్న 54,201 మంది కుక్ కమ్ హెల్పర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి.
- ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే విడుదల చేయాలి.
- ఎస్జీటీల బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడ్డ సుమారు 9 వేల ఉపాధ్యాయ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తామన్న సిబ్బందిని వెంటనే నియమించాలి.
- విద్యార్థులకు ఒక్క జత బట్టలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా, రెండు జతల బట్టలు అందించాలి.
- విద్యార్థుల ఆకలి తీర్చే 'సీఎం బ్రేక్ ఫాస్ట్' కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలి.
- సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి
డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, జూలై7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్నారుల రక్షణపై తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించారని డీజీపీ రవిగుప్తా ఎక్స్‌వేదికగా వెల్లడించారు. ఫన్ అండ్ డ్యాంక్ పేరిట సోషల్‌మీడియా వేదికగా కొందరు ఓ చిన్నారిని వేధింపులకు గురిచేయగా, ఆ వీడియోను సినీ హీరో సాయిధరమ్‌తేజ తెలంగాణ, ఏపీ సీఎంలకు షేర్ చేశారు. భవిష్యత్‌లో ఎవరూ అలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీజీపీ స్పందిస్తూ పిల్లలపై అనుచిత వ్యాఖ్యలను చేసిన వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ ఫైల్ చేశామని తెలిపారు. పిల్లలను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని, హాస్యం కోసం సోషల్ మీడియాను దుర్వినియోగం చేసేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మోదీకి ప్రాంతీయ పార్టీలే దిక్కు

- నాడు ప్రాంతీయ పార్టీల మనుగడే లేదన్నడు
- నేడు ఆ పార్టీ నాయకుల పంచన చేరిండు: మాజీ ఎంపీ వినోద్

మానకొండూర్‌లో జరిగిన సమావేశంలో వినోద్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్ రూరల్, జూలై 7 : ఆనాటి ప్రధాని మోదీ తీరు ప్రస్తుతం లేదని, ప్రాంతీయ పార్టీలకు మనుగడే లేదన్న ఆయన నేడు ఆ పార్టీల పంచనే చేరారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవాచేశారు. మోదీ ఇటీవల ప్రాంతీయ పార్టీ నాయకుడు పవన్ వద్దకు వచ్చి చేయి కలిపిన విషయాన్ని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లాలో పదవీ విరమణ చేసిన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం మానకొండూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాంతీయ భాషల మనుగడను దెబ్బ తీసేలా కొత్త చట్టాలకు హిందీ భాషను అనుసంధానం చేస్తున్నారని, ఈ విషయమై కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్టు వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి సమస్యల విషయంపై భేటీ అయ్యి ఏం సాధించారని ప్రశ్నించారు. కమిటీ వేశామని అంటున్నారని, అలాంటి కమిటీలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వేయలేదా? అని గుర్తు చేశారు. ''రాష్ట్రంలో బీఆర్ఎస్ నక్కలా కాచుకొని ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అంటున్నారు.. బిడ్డా.. నక్కలా కాదు.. పులిలా ఉన్నాం'' అని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని తాము అన్ని విధాలా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కేసీఆర్‌కు సూచించినట్లు గుర్తు చేశారు. వచ్చే ఐదేళ్ల తరువాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని, కేసీఆర్ నాయకత్వాన ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు వస్తే మహిళలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ప్రతి పక్షంలో ఉన్నా నిద్రపోమని, బలమైన రాజకీయశక్తిగా అవతరిస్తామని స్పష్టం చేశారు.

పార్టీ ఫిరాయింపులకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్: గంగుల

కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పెద్ద పీట వేస్తున్నదని, ఆనాడు వైస్రాయ్ హోటల్లో చంద్రబాబు ఆడిన నాటకాన్నే నేడు కాంగ్రెస్ చేస్తున్నదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దుయ్యబట్టారు. పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు రానున్న రోజుల్లో మంచి పదవులు పొందాలని ఆకాంక్షించారు. కొందరు పోతే పార్టీ డీలా కాదని, ప్రజల వెంబడి ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పెద్దపల్లి తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

ప్రైవేటీకరణకే కిషన్‌రెడ్డికి బొగ్గు శాఖ

- తెలంగాణకు బీజేపీ ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా?
- ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర
- ఐక్య ఉద్యమాలతో ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, జూలై 7(నమస్తే తెలంగాణ): 'తెలంగాణ కొంగు బంగారం, సిరుల మాగాణం సింగరేణిని బొంద పెట్టడానికే సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి పదవిని బీజేపీ ప్రభుత్వం ఇచ్చింది. కిషన్‌రెడ్డి ద్వారా సింగరేణిని ప్రైవేటీకరించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుంటే.. ఈ ప్రక్రియకు స్వయంగా సింగరేణి ప్రాంత ఖమ్మం జిల్లా బిడ్డ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వంత పాడటం విడ్డూరంగా ఉంది. ఏదేమైనా ఐక్య ఉద్యమాలు చేసి ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతం' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కారు కేంద్రానికి సపోర్టుగా నిలుస్తూ, సింగరేణి నష్టాల్లో ఉందని నమ్మించేందుకు విఫలయత్నాలు చేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఏ ఒక్క బొగ్గు గనిని కూడా ప్రైవేట్‌పరం కాకుండా కాపాడిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. వేలం ద్వారా గనులు కేటాయించొద్దని 2021 డిసెంబర్ 8న కేంద్రానికి కేసీఆర్ లేఖ రాశారని గుర్తుచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్వయంగా హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం పెట్టి దుర్మార్గమైన కొత్త పద్ధతికి శ్రీకారం చుడుతున్నారని, సోమవారం జరిగే వేలంలో స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొనబోతుండటం విచిత్రమని విమర్శించారు. ఈ వేలంలో సింగరేణికి సంబంధించిన శ్రావణపల్లి కోల్ బ్లాక్ కూడా ఉందని, ఇది కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే.. ఇక్కడి ప్రజలకు బీజేపీ ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్ట్ ఇదేనా? అని ప్రశ్నించారు.

కులవివక్ష, వేధింపులకు దళిత ఎస్సై బలి

మొదటిపేజీ తరువాయి...

చేసుకున్నాడని, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని శ్రీనివాస్ భార్య కృష్ణవేణితో పాటు కుటుంబసభ్యులు స్వగ్రామం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో జాతీయ రహదారిపై బైఠాయించి సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. కృష్ణవేణి తెలిపిన వివరాల ప్రకారం.. నారక్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ (38), 2014లో ఎస్సై ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం అశ్వారావుపేటలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్ని రోజులుగా సీఐ జితేందర్‌రెడ్డి నేతృత్వంలో అదే పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది సిబ్బంది ఎస్సై శ్రీనివాస్‌ను వేధింపులకు గురి చేస్తుండడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో జీవితంపై విరక్తి చెంది జూన్ 30న మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో పురుగుల మందు తాగగా హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చేర్పించారు. వారంపాటు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడిన శ్రీనివాస్, ఆదివారం తెల్లవారుజామున చనిపోయాడు. తన భర్త ఆత్మహత్యకు సీఐ, కానిస్టేబుళ్ల వేధింపులే కారణమని కృష్ణవేణి హైదరాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, జీరో ఎఫ్ఐఆర్ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు) నమోదు చేసి తదుపరి విచారణకు కేసును మహబూబాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ ఉన్నతాధికారులు సీఐ జితేందర్‌రెడ్డిని ఐజీ కార్యాలయానికి, నలుగురు కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

శ్రీనివాస్ మృతదేహంతో పెద్ద ఎత్తున రాస్తారోకో..

ఎస్సై శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామం నారక్కపల్లికి తీసుకొచ్చి కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దాదాపు మూడు గంటల పాటు జాతీయరహదారిపై బైఠాయించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. బాధితురాలికి అండగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి రాస్తారోకోలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కులవివక్ష, వేధింపుల కారణంగా ఓ పోలీస్ అధికారే ఆత్మహత్య చేసుకుంటే ఇక మామూలు ప్రజల పరిస్థితి ఏమిటని దళిత సంఘాల నాయకులు ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెంటనే రాజీనామా చేయాలని పెద్ద పెట్టున నినదించారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్నదని మండిపడ్డారు. ఎంతో కష్టపడి చదివి ఎస్సై ఉద్యోగం సాధించిన నారక్కపేటకు చెందిన దళిత బిడ్డ శ్రీనివాస్ ఉన్నతాధికారుల వేధింపులకు బలికావడం కలిచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. చట్టాన్ని రక్షించే పోలీస్‌కే రక్షణ లేదంటే ఇక సామాన్యుడి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దళితుడై ఉండి దళిత పోలీస్ అధికారి గురించి పట్టించుకోలేదంటే ఆయనకు దళితులపై ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తేటతెల్లమైందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ స్పందించి ఎస్సై శ్రీనివాస్ మృతికి కారకులైన సీఐ, పోలీస్‌సిబ్బందిపై విచారణ చేపట్టి తక్షణమే వారిని అరెస్ట్ చేసి ఉద్యోగం నుంచి రిమూవ్ చేయాలని, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సై మృతి బాధ్యులను శిక్షించాలని అశ్వారావుపేటలోనూ దళితసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు.

న్యాయం జరిగేలా చూస్తాం : ఎస్పీ రోహిత్‌రాజ్

నారక్కపేటలో ఆందోళన ఉద్రిక్తంగా మారడంతో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ చేరకొని అక్కడే ఎస్సై శ్రీనివాస్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తోపాటు మృతుడి భార్య, కుటుంబసభ్యులతో చర్చలు జరిపారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామని, మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్ట్ చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించి, అంత్యక్రియలు చేపట్టారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి: మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ఎస్సై ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎస్సై కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారుల వేధింపులతో ఓ ఎస్ఐ ఆత్మహత్య చేసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ సైకో పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. వేధింపులపై ఫిర్యాదు చేసినా కనీసం విచారణ జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి దళిత ఎస్సై మృతికి కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హత్యలు, ఆత్మహత్యలు నిత్యకృత్యమయ్యాయని అసహనం వెలిబుచ్చారు. శ్రీనివాస్ కుటుంబానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సానుభూతి ప్రకటిస్తూ ప్రకటన విడుదల చేశారు.

ఎస్సై మరణ వార్త విని గుండెపోటుతో మేనత్త మృతి

నర్సంపేట రూరల్, జూలై 7 : ఎస్సై శ్రీనివాస్ మరణ వార్త విని అతడి మేనత్త దార రాజమ్మ(65) గుండెపోటుతో ఆదివారం మృతిచెందింది. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లికి చెందిన రాజమ్మ తన మేనల్లుడు చనిపోయాడని తెలిసి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఆమెకు భర్త ఐలయ్య, ఇద్దరు కుమారులున్నారు. ఒకే రోజు ఇద్దరి మృతితో వారి కుటుంబంలో తీరని విషాదం అలుముకున్నది. ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది పరామర్శించారు.

'స్టేషన్ల ఆంధ్ర కానిస్టేబుళ్లు సన్యాసి నాయుడు, శేఖర్, సుభాని, ఇంకో ఇద్దరు శివనాగరాజు, ఉమెన్ పీసీ నాగలక్ష్మి సిస్టం వర్క్ చేస్తరు. రికార్డులు రాస్తరు. వాళ్లువాళ్లు గొడవ పెట్టుకొని కావాలని నా వర్క్ అపిండ్రు. ఎందు కాపిండ్రనడిగితే 'మేమిట్లనే జేస్తం.. నువ్వెవ్వన్నన్న పెట్టుకో.. మేం జెయ్యం' అని బ్లాక్‌మెయిల్ చేసిండ్రు. సర్లే అని వేరేవాళ్లను పెట్టుకొని పని చేయిస్తుంటే 'మేం జెయ్యం ఇంకొకరిని చెయ్యనియ్యం' అని హరాస్‌మెంట్ చేసిండ్రు. సీఐగారికి చెప్తే ఆయన నన్నే హరాస్‌మెంట్ జేసిండు. ఈ విషయాలన్నీ డీఎస్పీకి రిపోర్ట్ పెట్టినా పట్టించుకోలే. చెప్పుకోవద్దుగని వాళ్లంతా రెడ్డీస్ కద. వాళ్ల డామినేటే ఉంటది. వాళ్లదగ్గరికి పోయినా కూడా కూర్చోమనకపోవడం, నిలవెట్టిచ్చి మాట్లాడడం చేసేది. ఈ విషయాలన్నీ ఎస్పీకి రిపోర్ట్ పెట్టి 25 రోజులైనా యాక్షన్ లేదు. సీఐ చిన్నచిన్నవాటికి కావాలని మెమోస్ ఇస్తుండె. క్లోజెస్ పంపిస్తే చిన్నచిన్న కారణాలతో రిటర్న్ పంపుతుండె. ఎన్నిసార్లు మస్టర్‌చేసి పంపినా చిన్నచిన్న రిమార్క్స్ పెడుతూ రిటర్న్ చేస్తుండె. వీళ్లు కావాలనే నన్ను హరాస్‌మెంట్ చేస్తున్నరని అర్థమైట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నాలు చేసిన. ఈ డిలేలో హరాస్‌మెంట్ ఎక్కువైంది. ఆంధ్రా కానిస్టేబుళ్లు తిరగబడగడం, మర్యాద ఇవ్వకపోవడం ఇలా చెప్పుకుంటూ పోతే చానా ఉన్నయ్..'

– మరణ వాంగ్మూలంలో ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్

అంతర్జాతీయ ఐబీడీ సదస్సుకు హాజరైన యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ రావు

ఐబీడీపై 'యశోద'లో అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, జూలై 7: ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని యశోద గ్రూప్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ జీఎస్ రావు స్పష్టం చేశారు. ఉదరంలో మంట (ఇన్‌ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్–ఐబీడీ)తో బాధపడేవారికి చికిత్సను అందించడంలో వైద్య రంగం సాధించిన పురోగతిపై ఆదివారం మాదాపూర్ హైటెక్‌సిటీలోని యశోద దవాఖానలో అంతర్జాతీయ సదస్సు తోపాటు లైవ్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎస్ రావు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఐబీడీతో బాధపడుతున్నారని, దక్షిణ భారతావనిలో ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ఐబీడీ రోగులకు చికిత్సను అందించేందుకు కొత్త మందులు, బయోలాజికల్ ఏజెంట్లు అందుబాటులోకి వచ్చాయని, ఈ వ్యాధిని ముందుగానే గుర్తించగలిగితే 90% కంటే ఎక్కువ మంది రోగుల్లో సమస్యను నివారించేందుకు వీలుంటుందని సోమాజిగూడ యశోద దవాఖాన సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, ఐబీడీ స్పెషలిస్టు డాక్టర్ కిరణ్ పెద్ది వివరించారు. ఈ కార్యక్రమంలో దేశ, విదేశాలకు చెందిన 300 మందికిపైగా గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు, సర్జన్లు పాల్గొన్నారు.

దివ్య ఔషధం 'అగ్నిశిఖ'

- ఆయుర్వేదంలో వినియోగం
- అడవి నాభిగా ప్రసిద్ధి చెందిన తీగజాతి మొక్క
- నల్లమలలో విరివిగా లభ్యం

హైదరాబాద్, జూలై 7 (నమస్తే తెలంగాణ) : ఆయుర్వేద వైద్యంలో అడవి నాభిగా ప్రసిద్ధి చెందిన అగ్నిశిఖ మొక్కలు నల్లమలలోని పులిచెరువు, తుమ్మలబైలు తదితర ప్రాంతాల్లో విరివిగా పెరుగుతున్నాయి. దీనిని ఇంగ్లిష్‌లో ఫ్లేమ్ లిల్లీ, ఫైర్‌లిల్లీ, గ్లోరియసాలిల్లీ అని, వాడుక భాషలో నాగేటిగడ్డ, నీరుపిప్పిలి అని పిలుస్తుంటారు. వీటి పుష్పాలు ఎరుపు, నారింజ, తెలుపు, పసుపు రంగుల కలబోతగా దర్శనమిస్తాయి. ఆయుర్వేదంలో దీనిని దివ్య ఔషధంగా భావిస్తారు. దీని కాండం, ఆకులు, విత్తనాలు, పండ్లు, పూలు, దుంపలు అన్నీ విషపూరితమైనవే. ఇందులో 'కోల్చీసిన్' అనే ఆల్కలాయిడ్ ఉంటుంది. దీనిని పాము, తేలుకాటుకు విరుగుడుగా, చర్మవ్యాధులు, కిడ్నీ సమస్య, గాయాలకు మందుగా వాడుతారు. దీర్ఘకాలిక రోగాలతోపాటు కుష్టుతో కలిగే గాయాలు, కడుపు నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఆత్మన్యూనత వంటి మానసిక రోగాలతోపాటు రక్తపోటు నివారణకు చక్కగా పని చేస్తుందని, గర్భధారణ అవకాశాలను మెరుగుపర్చుతుందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టుల నిర్వహణ గాలికి!

- సీజన్ మొదలైనా ఓఅండ్ఎంకు నిధులు నిల్
- పూర్తికాని మరమ్మతులు.. ముగిసిన అగ్రిమెంట్లు..
- పంపింగ్ స్టేషన్లపై చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- ఎత్తిపోతలు ఎట్లా?: అధికారుల మల్లగుల్లాలు
- బడ్జెట్‌ల